

డీబీఎఫ్ శంకర్‌ను పరామర్శిస్తున్న హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి

డీబీఎఫ్ శంకర్‌కు పరామర్శ

మిరుదొడ్డి, మే 6: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ తండ్రి రాజయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం రాత్రి లింగుపల్లిలో డీబీఎఫ్ శంకర్‌ను పరామర్శించి రాజయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. హరీశ్‌రావు వెంట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కేసీఆర్ సభకు ఏర్పాట్లు ముమ్మరం

పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, రవీందర్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట, మే 6: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర ప్రచార కార్యక్రమం ఈనెల 10న సిద్దిపేటలో జరుగనున్నది. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నది. ఈ సభకు సంబంధించి సిద్దిపేట పట్టణంలోని గంగాజలకు ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభాస్థలి వద్ద పనులను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు భారీఎత్తున తరలిరానున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లు అందుకు అనుగుణంగా చేస్తున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

గజ్వేల్, మే 6: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం గజ్వేల్ ఐవోసీ కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన గజ్వేల్ నియోజకవర్గ స్థాయి ఓటరు పెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును ఆయన వినియోగించుకున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేర్‌లింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా గజ్వేల్ ఐవోసీలో వినియోగించుకున్నారు. అనంతరం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఓటరు పెసిలిటేషన్ కేంద్రంలో అన్ని సదుపాయాలు సమకూర్చి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కలెక్టర్ వెంట గజ్వేల్ ఏఆర్‌వో బన్సీలాల్ ఉన్నారు.

గజ్వేల్‌లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న కలెక్టర్

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

వర్గల్, మే 6: సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని వర్గల్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు జాలిగామ లతారమేశ్‌గౌడ్ అధికారులను కోరారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో ఆరోగ్యపరంగా తలెత్తే ఇబ్బందులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు లాంటి మౌలిక వసతుల విషయంతో ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బాలమల్లుయాదవ్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ బాల్‌రాజ్, జూనియర్ అసిస్టెంట్ శైలజ, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ లతారమేశ్‌గౌడ్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

గజ్వేల్, మే 6: రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏవో నాగరాజుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలని సూచించారు.

నేడు హుస్నాబాద్, కోహెడలో బీఆర్ఎస్ రోడ్‌షోలు

హుస్నాబాద్, మే 6: హుస్నాబాద్ పట్టణంతో పాటు మండలంలోని పందిల్ల, కోహెడ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ రోడ్‌షోలు జరుగుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, పట్టణ సమన్వయ కమిటీ కన్వీనర్ గోవిందర్‌రవి, కోహెడ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, 5.30గంటలకు హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజీ వద్ద, సాయంత్రం 7 గంటలకు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్‌షోలు జరుగతాయన్నారు. ఈ కార్యక్రమాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్

సిద్దిపేట అర్బన్, మే 6: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి నిర్వహించారు. ఇందులో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 11 బ్యాలెట్ యూనిట్లు, 10 కంట్రోల్ యూనిట్లు, 20 వీవీ ప్యాడ్ యూనిట్లను ఆయా నియోజకవర్గ ఏఆర్‌వోలకు పంపిణీ చేశారు. ఈ యంత్రాలను పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగే రోజు వరకు సంబంధిత ఏఆర్‌వో పరిధిలోని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చి పోలింగ్‌లో ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవక్కపల్లిలో ధార్మికకార్య వీరగల్లు విగ్రహం గుర్తింపు

బెజ్జంకి, మే 6: మండలంలోని దేవక్కపల్లిలో ధార్మిక కార్య వీరగల్లు విగ్రహాన్ని గుర్తించినట్లు తెలంగాణ చరిత్ర బృందం యువ పరిశోధక సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విగ్రహం మీద ఉన్న ఆనవాళ్లు, చెక్కబడిన వివరాలను పరిశీలిస్తే కల్యాణి చాళుక్యుల కాలం నాటి క్రీ.శ. 1071 జూన్ 30న నాటి దానలు, అప్పటి పరిస్థితి తెలుస్తుందని, కర్ణాటక ప్రాంతంలో ఈ విగ్రహాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మన రాష్ట్రంలో తక్కువ విగ్రహాలను గుర్తించినట్లు తెలిపారు.

దేవక్కపల్లిలో గుర్తించిన ధార్మికకార్య వీరగల్లు విగ్రహం

కాంగ్రెస్ హయాంలోనే కరువు కష్టాలు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కొమురవెల్లిలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, మే 6: ఒట్టు వేసుడు రేవంత్ రెడ్డి వంతే, ఒట్టును గట్టు మీద పెట్టుడు ఆయన వంతే అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు కిష్టంపేట, గౌరాయపల్లి, మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, రాంగసాగర్, రసూలాబాద్, ఐనాపూర్, తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి, గురువన్నపేటలో భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆహామీలను అమలు చేయమంటే ముఖ్యమంత్రి రేవంత్ పండబెట్టి తొక్కుతా.. గుడ్లు పీకుతా.. పేగులు మేడల వేసుకుంటా అని తిట్ల దండకం మొదలు పెట్టాడన్నారు. రేవంత్ తీరు చూస్తుంటే ఐతే ఓట్లు లేదంటే తీట్లు అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు రెండు పంటలకు పుష్కలంగా నీరు ఇస్తే నేడు కాంగ్రెస్ హయాంలో కరువు కష్టాలు వచ్చాయన్నారు. కాల్వలో ఉన్న నీళ్లను ఎత్తిపోయని మీకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణ మాఫీ, రైతుబంధు ఎకరాకు రూ.15వేలు, పింఛన్ రూ.4వేలు, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి కింద వధువుకు తులం బంగారం, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపొందించి మెగా డీఎస్సీ వేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిలో ఏ ఒక్కటైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందునే సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి కొమురవెల్లి మల్లన్న, యాదాద్రి నరసన్న మీద ఒట్టు పేరుతో ముందుకు వస్తున్నాడని మండిపడ్డారు. యాదాద్రిని అద్భుతంగా నిర్మించిన కేసీఆర్ ఏఒక్క రోజు కూడా రాజకీయం చేయలేదని, అయోధ్యలో రామమందిరం నిర్మిస్తే దానిని బీజేపీ ఓట్లకు వాడుకుంటుందని విమర్శించారు. తెలంగాణ గలం పార్లమెంట్‌లో వినిపించాలంటే బీసీ బిడ్డ బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర నాయకుడు విజేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొడిగం కృష్ణారెడ్డి, గొల్లపల్లి కిష్టయ్య, బుడిగె గురువయ్యగౌడ్, మల్లేశం, ముత్యం నర్సింహులు, కృష్ణాగౌడ్, కొండ శ్రీధర్, ఎంపీటీసీలు, ఆయా గ్రామశాఖ అధ్యక్షులు,మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన నగదు

భారీగా నగదు పట్టివేత

సిద్దిపేట టౌన్, మే 6: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు.సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు నేతృత్వంలో సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన రమేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా తన ద్విచక్ర వాహనంలో రూ.8 లక్షల 62 వేలు తీసుకు వెళ్తుండగా నగదును సీజ్ చేశారు. చౌడారం గ్రామానికి చెందిన రాములు ఆధారాలు లేకుండా బైక్‌లో తరలిస్తున్న రూ. 6 లక్షలను పట్టుకున్నారు. ఇద్దరి వద్ద మొత్తం రూ.14.62లక్షల నగదును సీజ్ చేశారు.

గజ్వేల్: సింగాటంలో మాట్లాడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

చేర్యాల: చేర్యాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: బచ్చాయిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



హుస్నాబాద్‌టౌన్: ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ వాల సుప్రజ తదితరులు

పల్లెపల్లెనా కారు జోరు

- ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం
- మెదక్, కరీంనగర్ ఎంపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న గులాబీదండు

ప్రచారంలో గులాబీ దండు దూసుకుపోతోంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపించడంతో ఊరూరా క్యాంపెయిన్ కొనసాగుతోంది. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం నిర్వహిస్తున్న రోడ్ షోలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండగా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా రెట్టింపు ఉత్సాహంతో క్షేత్రసాయికి వెళ్లి జనంతో మమేకమవుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, పదేండ్లుగా పేదలకు ఏమీ చేయని కేంద్ర బీజేపీ సర్కారుకు బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. – సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, మే 6



మద్దూరు(ధూళిమిట్ట): కొండాపూర్‌లో ప్రచారం చేస్తున్న మంద యాదగిరి



దుబ్బాక టౌన్: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కత్తికార్తీక

సిద్దిపేట: సిద్దిపేటలో ప్రచారం చేస్తున్న వైశ్య విభాగం నాయకులు



జగదేవ్‌పూర్: బస్వాపూర్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మర్కూక్: అంగడికిష్టాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట టౌన్: 42వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

రాయపోల్: మంతూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు



నంగునూరు: కొండంరాజ్‌పల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణరావుపేట: మల్యాలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తొగుట: ఎల్లారెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ వేల్పుల స్వామి తదితరులు



అక్కన్నపేట: కుందన్‌వానిపల్లిలో ప్రచారం చేస్తున్న సంపత్

సిద్దిపేట టౌన్: ప్రచారం చేస్తున్న సత్యానందం

బీఆర్ఎస్‌లో చేరికల జోరు

రాయపోల్, మే 6: బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి గ్రామానికి చెందిన నారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాధుసూదన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, మహేశ్ తదితరులు సోమవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అతడి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి దుబ్బాక నియోజకవర్గం నుంచి 50వేల మెజార్టీ అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో బీఆర్ఎస్‌లో చేరిన దీపాయంపల్లికి చెందిన నాయకులు

దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

మిరుదొడ్డి, మే 6: మిరుదొడ్డి టౌన్ –2 దళిత ఎంపీటీసీ ధర్మారం లక్ష్మి భర్త ధర్మారం మల్లయ్యను కులం పేరుతో దూషించిన బీజేపీ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు సూకురి లింగం, పార్టీ యువత విభాగం మండల అధ్యక్షుడు ధర్మారం కుమార్, మాజీ ఎంపీటీసీ దార స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రోడ్ షో సందర్భంగా ఏర్పడిన వివాదంలో కులం పేరుతో దూషించాడని సోమవారం వారు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే దళితులపై మరిన్ని దాడులు జరగడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, పార్టీ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రంగమైన రాములు, గొల్ల రాములు, రాజహేందర్ రెడ్డి, సుధీర్, వెంకటయ్య పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

అక్కన్నపేట, మే 6: మండలంలోని మల్లంపల్లి, గౌరవెల్లిలోని బెల్టుషాపులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి నిల్వ ఉన్న 12 లీటర్ల మద్యం, సుమారు 30 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఇండ్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర దుకాణాల్లో అనుమతి లేకుండా బెల్టుషాపులు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో జూదం ఆడినా సమాచారం ఇవ్వాలన్నారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం, గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నా, కలిగి ఉండి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల 87126 67445, 87126 67446, 87126 67447 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మే 6:మద్దూరు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహ్మద్ షర్పుద్దీన్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహ్మద్ అజహర్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం పంచాయతీ కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో..

కొమురవెల్లి, మే 6: మండలంలోని ఐనాపూర్‌లో మాజీ సర్పంచ్ పబ్బోజు విజేందర్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం గ్రామస్తుతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మెరుగు కృష్ణాగౌడ్, జయరాములు, నర్సింహులు పాల్గొన్నారు.

మద్దూరు: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

కొమురవెల్లి: ఐనాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజేందర్